క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



నూతన బస్సు సర్వీసుకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆదోని డిపోకు కొత్తగా వచ్చిన నాలుగు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇందులో శ్రీశైలంకు రెండు, బెంగళూరుకు రెండు బస్సు సర్వీసులను నడపనున్నట్లు చెప్పారు. ముస్ముందు మరిన్ని సర్వీసులను నడపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం రఫిక్‌అహ్మద్, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర, సీఐ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల వితరణ

ఆదోని టౌన్: మహాసిమెంట్ (శ్రీ జయ జ్యోతి సిమెంట్స్) వారు శుక్రవారం ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు 16 బారికేడ్లను మహా సిమెంట్ రీజినల్ మేనేజర్ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో అందించారు. ఆయన మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ లాభాలబాటలో నడుస్తోందన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తమ కంపెనీ తరపున 16 బారికేడ్లను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహా సిమెంట్ టెక్నికల్ ఆఫీసర్ బలిజ శ్రీధర్, సేల్స్ ఆఫీసర్ క్రిష్టారెడ్డి ఉన్నారు.

రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు



ఎమ్మిగనూరురూరల్: స్థానిక రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లగా ఆదోని మండలం ఇస్వీ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్ఐ శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించటంలో తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు.

పంట నమోదు చేసుకోండి

కౌతాళం: పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని ఆదోని ఏడీఏ అరుణ కుమారి సూచించారు. శుక్రవారం ఆమె కౌతాళంలోని కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి శేషాద్రి అధ్యక్షతన సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె పొలాలకు వెళ్లి ఈ-కేవైసీ, పంటన మోదు ప్రక్రియను పరిశీలించారు.

రైలు నుంచి పడి వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: రైలులో నుంచి కింద పడి కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కొటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆలూరు మండలం మొలగవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి గాయాలపాలయ్యాడని బాధితుడు వైద్యులకు తెలియజేశాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

506 మంది గర్భిణులకు స్కానింగ్



స్కానింగ్ పరీక్షలకు తరలివచ్చిన గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్య గర్భిణులు వచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల పెద్ద సంఖ్యలో గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఎక్కువ సంఖ్యలో రావటంతో వారికి సరిపడ కుర్చీలు లేక అవస్థలు పడుతూ కింద కూర్చున్నారు. 506 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటిండెంట్ డాక్టరు మైత్రేయి, డాక్టర్ సుజిత చెప్పారు. గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

విగ్రహాన్ని కూల్చేందుకే విధ్వంసం

- విజయవాడలో రాజ్యాంగ నిర్మాత విగ్రహ శిలాఫలకాల ధ్వంసంపై వెల్లువెత్తిన ఆగ్రహం
- పచ్చమూకల చర్యలపై నిరసనలు



ఆదోనిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు



పెద్దకడబూరులో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం,



కౌతాళంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: బెజవాడ నడిబొడ్డున ప్రపంచం గర్వించే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పచ్చమూకలు కూల్చే కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ మండిపడ్డారు. బెజవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి సంబంధించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని టీడీపీ శ్రేణులు చీకటిలో ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలిపాయి. ఇందులో భాగంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, నందవరం జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్ఐసీ ప్రభాకర్, గుడికల్ బాస్కర్, రవి, ముత్తు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, మహబుబ్‌బేగ్, సయ్యద్ చాంద్, ఫయాజ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పెద్దకడబూరు : విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడానికి పచ్చమూకలు చేసిన చీకటి దాడులను ఖండిస్తున్నామని కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, ఎస్సీ సెల్ నాయకులు అర్లప్ప అన్నారు. విజయవాడలో జరిగిన దారుణానికి నిరసనగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యాక్రమంలో ఎస్సీసెల్ నాయకులు కొరవ సుందరము, ఏసన్న, ఏసేబు, హనుమన్న, ప్రసాద్, ఆనంద్, లోకయ్య, అన్నిల్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలను ధ్వంసం చేసిన మూర్ఖులను శిక్షించండి

కౌతాళం: విజయవాడలోని భారీ అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో శిలాఫలకాలను, లోపల ఉన్న కొన్ని భాగాలను ధ్వంసం చేసిన మూర్ఖులను వెంటనే శిక్షించాలని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, బాపురం జైపాల్ తదితరులు డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని చూడి, ఏరిగేరి, బాపురం, కామవరం గ్రామాల్లోనూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీమోను, వీరేష్, ఈరన్న, సంజీవ్ పలువురు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహనికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



శిలాఫలకాల ధ్వంసంపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాజ్యాంగ నిర్మాత కొలువైన స్థలం ఇలాంటి ఘటనలు జరగడం చాల బాధకరం. ప్రభుత్వం దీనిని సీరియస్ తీసుకుని బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి. దీని వెనుక ఎంతటి వారైన సరే వదిలి పెట్టికుండా శిక్షించాలి, లేకుంటే ఇలాంటి సంఘటనలు మరోచోట జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది.

–వీరేష్, ఎరిగేరి, కౌతాళం

ఆదోని టౌన్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన టీడీపీ గుండాలను శిక్షించాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బి.దేవా, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు కార్యక్రమంలో కౌన్సిలర్ చలపతి, భాస్కర్, మమ్ముత్తుస్వామి, ఫయాజ్, సిద్ధ, మల్లికార్జున, తాయన్న, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు



అంబేడ్కర్ ఒక కులానికి చెందిన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి. విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి కుల రాజకీయాలు చేయాలనుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దేశం అభివృద్ధిలో, అణగారిన వర్గాల సంక్షేమానికి డా.బి.ఆర్. అంబేడ్కర్ ఎంతో కృషి చేశారు. ఒక పార్టీకి చెందిన వ్యక్తి అంబేడ్కర్ కాదని, ప్రజల మనిషి అన్న విషయాన్ని గుర్తించాలి. కుల రాజకీయాలకు చేసేందుకు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం.

– నాగప్ప, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు

విగ్రహ ధ్వంసం పనికిమాలిన చర్య



విజయవాడలోని 125అడుగుల అంబేడ్కర్ విగ్రహం అవరణంలో కొందరు దౌర్జన్యకారులు చొరబడి శిలాఫలకాలను ధ్వంసం చేయడం చాల బాధకరం. ఇలాంటి పనులు పనికిమాలిన చర్య. దీనికి బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలి. ప్రభుత్వం స్పందించి వెంటనే వారిని అరెస్టు చేయాలన్నారు.

– సీమోను, కౌతాళం

బాల్యవివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయనశర్మ సూచించారు. శుక్రవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, ఎంఈఓలు, పోలీసు అధికారులతో బాల్యవివాహాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గ్రామసభ ఏర్పాటు చేసుకొని చిన్నవయస్సులో వివాహాలు చేస్తే వచ్చే ఆరోగ్య, మానసికంగా జరిగే నష్టాల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి స్కూల్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి కార్యాలయ పరిపాలన అధికారి కె.వసుంధర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, డిప్యూటీ డీఈఓ వెంకటరమణరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల : మండల పరిధిలోని గాజులదిన్నె స్టేజ్ ఎల్లెల్సీ కాలువ సమీపంలో చిన్నమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్లా(50) శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. మిన్నల్లా గ్రామంలో హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మిన్నల్లా మానసిక వ్యాధితో బాధపడేవాడు. కుటుంబ సభ్యులు కర్నూలులో వైద్యం చేయిస్తున్నారు. ఎన్ని మందులు వాడిన రోగం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం గాజులదిన్నె స్టేజ్ ఎల్లెల్సీ కాలువ సమీపంలో మద్యం సీసాలో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలోని పొలాల రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య ఆశమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఎరుకల కులస్తుల్ని ఆదుకోండి

కౌతాళం: ఎరుకల కులస్తుల్ని ఆదుకోవాలని ఎరుకల సంఘం మండల నాయకుడు రామచంద్ర కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శుక్రవారం కౌతాళంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామాల్లో వెయ్యి ఎరుకల కుటుంబాలు ఉన్నాయని ప్రభుత్వం వారిని గుర్తించి జీవన ఆధారం చూపాలన్నారు. ప్రస్తుతం కులవృత్తి కోల్పోవడంతో ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. వంకల పక్కన భూములు, ల్యాండ్ సీలింగ్ బీడు భూములు లేకపోవడంతో ఈత చెట్లు కనుమరుగైపోయాయని, ఈత ఆకులు లేకపోవడంతో పనులు లేక వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్టీ సబ్సిడీ రుణాలను ఇప్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రామాంజనేయులు, హనుమేష్, పెద్దరమేష్, నరసింహులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి సూచించారు. శుక్రవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చెన్నాపురం, బోడబండ గ్రామాల్లో పత్తి పంటను నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ మోహన్‌విష్ణువర్ధన్‌లతో కలసి పరిశీలించారు. పత్తి పంటను పచ్చదోమ ఆశించినట్లు గుర్తించామని చెప్పారు. అలాగే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తికొండ మండలం కోతిరాళ్ల, మండగిరి గ్రామాల రైతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

భర్త చితకబాదడంతో మహిళకు గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని అరుంజ్యోతినగర్‌కు చెందిన అంకిత భర్త కొట్టాడని గాయాలతో ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరింది. బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలం రాతన గ్రామానికి చెందిన రవికుమార్‌తో అంకితకు గత ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. మూడు నెలలు సంతోషంగా సంసారం సాగగా.. గత ఐదు నెలల నుంచి హింసిస్తున్నాడు. మూడు రోజుల నుంచి బెల్టుతో చితకబాదుతూ వేధిస్తుండడంతో గాయాలతో ఆస్పత్రిలో చేరినట్లు తెలిపింది. విచారణ చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆదివాసిల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని, తమ హక్కుల సాధన కోసం ఆదివాసీల్లో కూడా చైతన్యం రావాలని ఏబీసీసీ చైర్మన్ మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, హైకోర్ట్ సీనియర్ న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సునీల్‌కుమార్ అన్నారు. ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



దుర్గ నగర్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా అడిషనల్ మలేరియా అధికారి చంద్రశేఖర్

కోసిగి: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ మలేరియా అధికారి చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కోసిగిలోని దుర్గనగర్ కాలనీలో పర్యటించి డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్ డివిజన్ ఆఫీసర్లు నరసింహులు, మంజునాథ, కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గొల్ల కేశన్న

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని మల్కాపురం, పరమాన్‌దొడ్డి గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకులపై జరిగిన దాడులపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో తప్పుగా ఏమి మాట్లాడలేదన్నారు. తెలుగుదేశం పెద్దలు గొడవలు జరగకుండా చూడాలని చెప్పారన్నారు. అయితే ఈ విషయంపై ఎమ్మెల్యే బీవీ ఆమెను విమర్శించడం తగదన్నారు. పరమాన్‌దొడ్డిలో ఎడ్ల బండ్లు వెళ్లే రస్తాకు రాళ్లు అడ్డుగా పెడితే తొలగించటానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయటం తప్పుకాదా అని ప్రశ్నించారు. అలాగే మల్కాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దయ్యపై సోదరుడు గ్రామ తెదేపా నాయకుల ప్రోద్బలంతో కాపుకాసి దాడి చేసి హత్యచేయాలని యత్నించారన్నారు. అన్నదమ్ములే అయినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక దాడికి పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వాస్తవాలను కప్పిపెట్టి అవాస్తవాలను మాట్లాడుతున్నాడన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో ఎటువంటి గొడవలు లేకుండా మండలం ప్రశాంతంగా ఉందని గుర్తుచేశారు. సమావేశంలో సర్పంచులు రంగస్వామి, వెంకట్రామిరెడ్డి, మాధవస్వామి, నాయకులు కోటేకల్ లక్ష్మన్న, యంకప్ప, లక్ష్మీనారాయణ, రాముడు, వెంకటేశ్వర్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు వసతులు కల్పించండి

ఆదోని రూరల్: రణమండల ఆంజనేయస్వామి శ్రావణమాసం ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదోని తహసీల్దార్ శివరాముడు పిలుపునిచ్చారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

వ్యవసాయ, కార్మిక రంగాలను కాపాడుకుందాం


ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ, కార్మిక రంగాలను కాపాడుకుందామని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్న గౌడ్, నాయకులు బీటీ చిన్నన్న, ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష,కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడులు పిలుపునచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు.

సీఐల బాధ్యతల స్వీకరణ



డీఎస్పీని కలిసిన టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆదోని టూటౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లకు కొత్తగా సీఐలు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. టూటౌన్ సీఐగా పి.వి.సూర్యమోహన్‌రావు, త్రీటౌన్ సీఐగా రామలింగప్ప బాధ్యతలు తీసుకున్నారు. ఇరువురు డీఎస్పీ శివ నారాయణస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టూ టౌన్ సీఐ గోపీ ఎస్పీ వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న సీఐ సూర్యమోహన్‌రావు వచ్చారు. అదేవిధంగా త్రీటౌన్ సీఐ నరసింహరాజు వీఆర్ ఎస్పీకి వెళ్లగా ఆయన స్థానంలో కర్నూలు వీఆర్‌లో ఉన్న రామలింగప్ప వచ్చారు.



ఇస్వీ ఎస్ఐగా నాగేంద్ర

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ నూతన ఎస్ఐగా నాగేంద్ర శుక్రవారం బాధత్యలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.